# 'బాస్టర్డ్'

కారు దిగొచ్చి హాల్లోకి అడుగుపెట్టినో లేదో "హై డాడీ! నీ కోసమే వెయిట్ చేస్తున్నాను'' అంటూ మేడమెట్లుదిగుతూ పలకరించింది మా అమ్మాయి సోనీ, అంటే అదే సుహాసిని. నేను సోఫాలో కూర్చుని బూట్లు విప్పుకుంటూ "ఏమిటి విశేషం?" అని అడిగేను. నా ఎదురుగుండావున్న సోఫాలో కూర్చుని, అదేదో అధ్యాత్మిక గ్రంథం అనుకుంటాను, దాన్ని చదువుతూ సమాధి స్థితిలో వున్న మా ఆవిడ ఒక్కసారి బాహ్యప్రపంచంలో అడుగెట్టి దృష్టి నా మీదే వుంచి, దివ్యదృష్టిని వెనకనుంచి వొస్తున్న సోనీ మీదకి ప్రసరించింది.

"ఇఫ్ యు డోంట్ మైండ్, కారు తీసుకెళ్ళి మళ్ళీ ఓ గంటలో వొచ్చేస్తాను డాడీ!'' అంది సోని. నేనేమి సమాధానం చెబుతానో వినడానికిలాగుంది మా ఆవిడ దృష్టి తీక్షణం చేసింది.

"రాత్రి నర్సపూర్ ఎక్స్‌ప్రెస్‌లో నేనూ గుర్నాథం గుంటూరెడుతున్నాం. గుంటూరులో గుర్నాథానికి........''

''తెలుసు. తెలుగు రచయితల సంఘం గుర్నాథం అంకుల్‌ని ఫెలిసిటేట్ చేస్తున్నట్టూ మీరు బయల్దేరివొస్తున్నట్టూ పొద్దున్నే అన్నయ్య కారు తీసుకుని స్టేషన్‌కి వొస్తున్నట్టూ గుంటూరు నుంచి వొదిన ఫోన్ చేసింది'' అంది సోనీ

''ఇప్పుడు డ్రయివర్ వెళ్ళి ఎనిమిదింటికి గుర్నాధాన్ని తీసుకొస్తాడు. మరి మేమిద్దరం యిక్కడే భోంచేసి తొమ్మిదింటికి బయల్దేరివెళ్ళాలి'' అన్నాను, ఈ పరిస్థితుల్లో తను కారు తీసుకుపోతే మేమిబ్బందిపడతాం అని దానికి తెలియాలని.

''డోంట్ వర్రీ డాడీ! ఇప్పుడు ఆరున్నరేకదా అయింది. ఓ ఫ్రెండ్ మేరేజ్ రిసెప్షన్‌కెళ్ళి ఎనిమిదింటికల్లా గుర్నాథం అంకుల్‌ని పికప్ చేసి, మీ డిన్నర్ అయింతర్వాత మిమ్మల్నిద్దర్నీ నేనే సికిందరాబాద్ స్టేషన్‌లో డ్రాప్ చేస్తాను- సరేనా?'' అంది.

''ఓకే'' అని నేనంటుంటే మా ఆవిడ చూపులు సూదుల్లా గుచ్చుకుంటున్నాయి.

''థేంక్స్ అయితే డ్రయివర్‌ని యింటికి పొమ్మంటాను. బై దిబై- పోస్ట్‌లో వొదిన రాసిన కొత్త నవలొచ్చింది. ఈ లోగా జస్ట్ హేవెగ్లాన్స్ ఎటిట్. టాటా!'' అంటూ తుర్రుమంది.

''వయసొచ్చిన పిల్ల. ఓ మూల పెళ్ళి సంబంధాలు చూస్తున్నాం. రాత్రి కారేసుకు వెడతానంటే- కనీసం ఎవరి పెళ్ళి, రిసెప్షన్ ఎక్కడ, ఇదంతా నిజమా అబద్ధమా - ఏమీ తెల్సుకోకుండా సరే అనడమే!'' అంటూ మా ఆవిడ నోరు ఉరిమింది.

''నువ్వేంజేస్తున్నావు! సోనీని నువ్వే అడగలేకపోయావా?''

''నేనడిగితే సమాధానం చెప్పేలాగ పెంచారా? మీరడిగితే, మీకనుమానం వొస్తే ఎక్కడికెళ్ళిందో తెల్సుకోగలరన్న భయమేనా వుంటుంది. కాని, మీరడగరని దానికి తెలుసు.''

''అది యం ఫిల్. పేసయింది. ఉద్యోగం చేసుకుంటూ రిసెర్చ్ చేస్తుంది. రేపో మాపో డాక్టరేట్ వొస్తుంది. అది అబద్ధమాడదల్చుకుంటే నన్ను మాత్రం నమ్మించలేదా? నీకన్నీ అనుమానాలే. దానికామాత్రం, స్వతంత్రం ధైర్యం అవసరం. దానికి ఆత్మవిశ్వాసం, సంస్కారం, ప్రపంచజ్ఞానం వున్నాయి.... అది సరే, మన కోడలేదో కొత్త నవల రాసిందట!'' అడిగేను కాస్త ధోరణి మారుద్దామని.

తన చేత్తో ముట్టుకోవడం యిష్టంలేకేమో టీపాయ్ మీదున్న టివి రిమోట్ కంట్రోల్‌తో న్యూస్ పేపర్ కిందున్న పుస్తకాన్ని నా వైపు నెట్టింది. ఆ పుస్తకం కవర్ పేజీ చూశాక మా ఆవిడ కోడలో ఫోబియా గురించి జ్ఞానోదయమయింది. దాని టైటిల్ 'బాస్టర్డ్.' దాని కింద పంచ వర్ణ చిత్రం. ఒక కిటికీ, దాని కవతల నగ్నంగా రతి క్రీడలో నిమగ్నులైన ఒక యువతీ యువకుడు, కిటికీ కవతల వాళ్ళ వైపు స్టెన్ గన్ గురిచేసి ట్రిగ్గర్ నొక్కడానికి సిద్ధంగావున్న ముసుగుపీరుడు. అట్టఅడుగున రచన 'మీరా' అని వుంది. అంటే మీనాక్షీ రామానంద్. అది మా కోడలు కలం పేరు. వాళ్ళ వాళ్ళు సావిత్రి అని పేరు పెట్టు

నందుకు సంతోషించేను "మీకు నిత్య పారాయణకి పనికొస్తుందన్న సదుద్దేశంతో పంపినట్లుంది. చదువుకోండి" అంటూ మా ఆవిడ లేచింది నాకు కాఫీ తేవడానికి.

*　　　　*　　　　*

తెలుగు రచయితల సంఘం గుర్నాథానికి సన్మానం చేస్తుందంటే నాకు సన్మానం చేస్తున్నంత ఆనందంగా వుంది. అందుకు ముఖ్యమైన మూడు కారణా లున్నాయి. మొదటిది వాడి కథ లంటే నాకు మహా యిష్టం. సున్నితమైన హాస్యం, వ్యంగ్య ధోరణి, చివర్న ఓ మలుపుతో సోమర్సెట్ మామ్ కథల్లాగ ఎటువంటి పాఠకుల్నయినా ఆకట్టుకుంటాయి అలాంటి కథలిప్పుడు రావటమే లేదు. ఇంక రెండవ కారణం మూడేళ్ళ క్రితం గుర్నాథం జీవితానికి తగిలిన విషాధ ఘాతం. దాని దుష్ఫలితాల నుంచి యింకా వాడుతేరుకోలేదు. దీనితో కాస్త మానసిక వాతావరణంలో మార్పొస్తుందన్న ఆశ.

వాడికి నాకు లాగే ఓ కొడుకూ కూతురూను. కొడుకు చదువుకుని స్టేట్స్‌కి వెళ్ళి అక్కడే వుద్యోగం చూసుకుని ఓ అమెరికన్ అమ్మాయిని పెళ్ళాడి అక్కడే స్థిరపడిపోయేడు. వాడి మంచిచెడ్డల బాధ్యత వాడే మోసుకునేటంత ప్రయోజకుడయేడు అని వీడూ వీడి భార్యా సమాధానపడ్డారు. కూతురు బియ్యే పేసయింది. అరమరికలు లేని తెలుసున్న సంబంధం చేసేడు. అల్లుడు ఎంబియ్యే పేసయ్యి వైజాగ్‌లో ఓ ప్రయివేట్ కంపెనీలో మంచి ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళయిన మూడేళ్ళకి ఆ వుద్యోగం మానేసి అక్కడే మరో వ్యాపారం మొదలెట్టేడట. ఆ వుద్యోగం ఎందుకు మానేసేడో, ఈ వ్యాపారంలో నష్ట మెందుకొచ్చిందో ఎవరికీ తెలీదు. మొత్తం మీద డబ్బు తెమ్మని భార్యని వేధించడం మొదలెట్టేడు. గుర్నాథం కూడా కూతురు అగినప్పుడల్లా వీలైనంత వరకూ సాయం చేస్తూ వొచ్చేడు. మూడేళ్ళ క్రితం ఆ అమ్మాయికి ఆరో నెల గర్భిణీ, రేపోమాపో పుట్టింటికి తీసుకొద్దామనుకుంటుండగా గ్యాస్ స్టౌ వెలిగిస్తూండగా ప్రమాదవశాత్తూ చీరంటుకుని చచ్చిపోయిందని ఫోనొచ్చింది. అందరం గొల్లుమన్నాం. బంగారం బొమ్మలాంటి పిల్ల. అక్కడి కెళ్ళేక తెలిసింది- అది ఏక్సిడెంట్ కాదు హత్యేనసీ, గుర్నాథం అల్లుడు సకల గుణాభిరాముడుగా మారేడనీ, వాడికి లోకల్ పోలీసాఫీసర్ బంధువవడంవల్ల అతని సహాయంతో కేసు లేకుండా బయటపడ్డాడనీ. ఆ షాక్‌కి తట్టుకోలేక, చేసిన తీర్థ యాత్రలు, చేయించిన వైద్యం విఫలమవ్వగా రెండు నెలలు తిరగకముందే

గుర్నాథం భార్య కన్నుమూసింది. అర్నెల్ల తర్వాత గుర్నాథం అల్లుడు మళ్ళీ పెళ్ళి చేసుకుని బుద్ధిగా వుంటున్నాడుట. ఆ విధంగా గత మూడేళ్ళనుంచీ గుర్నాథం యాంత్రికంగా జీవిస్తున్నాడు కొడుకొచ్చి స్టేట్స్‌కి తనతో రమ్మన్నాడు. వీడు రానుపొమ్మన్నాడు. ఈ సన్మానంతో మళ్ళీ పదిమందిలోనూ పది కొంతయినా తేరుకుంటాడని నా ఆశ.

మరి మూడో కారణం- ఆ సన్మానం గుంటూరులో జరగడం. గుంటూరులో మా అబ్బాయి రామానంద్ గవర్నమెంట్ డాక్టరు. మా కోడలు మీనాక్షి లెక్చరర్. పైగా, మా కోడలు కూడా రచయిత్రి కనక అందరం సరదాగా ఓ రోజు గడిపినట్టుంటుందనీ, వీలయితే గుర్నాథం ద్వారా ఆమె రచనల తీరు విషయంలో హెచ్చరించాలనీ వాడు రమ్మనగానే వాడిని వెంటబెట్టుకుని గుంటూరు ప్రయాణమయ్యేను.

* * *

మమ్మల్ని ఓ పది నిమిషాల ముందే స్టేషన్‌లో డ్రాప్ చేసి "హేపీ జర్నీటు బోత్ అఫ్ యు డాడీ!" అని నాతోనూ, "అంకుల్! నేను చెప్పింది మరిచిపోకండి. టాటా!" అన్ని గుర్నాథంతోనూ అనేసి వెళ్ళిపోయింది సోనీ. మేమిద్దరం మా ట్రావెల్ బేగ్స్ పట్టుకుని స్టేషన్‌లో రెండ మెట్లెక్కేమో లేదో అలాగే నిలబడిపోయాం. "నర్సపూర్ ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్‌లో సంఘ విద్రోహులు బాంబు పెట్టినట్టు అనుమానంగా వుంది. పోలీస్ సిబ్బంది తనఖీ చేస్తున్నారు. పోలీసువారు అనుమతిచ్చేవరకూ ఎవరూ ప్లాట్‌ఫామ్ మీదకు రాకూడదు ప్రయాణీకులకు ఇబ్బంది కలిగించినందుకు చింతిస్తున్నాం" అంటూ మైక్‌లో ఎనౌన్స్‌మెంటు. నన్ను ఆనవాలు పట్టిన ఓ పోలీస్ ఇన్స్పెక్టరు అతని వెనకాలే రమ్మని సౌజ్ఞచేసి మమ్మల్ని వెనుకనుంచి తీసుకెళ్ళి పార్సిలాఫీసులో ఓ చదునైన పార్సిల్ చూపెట్టి కూర్చోమన్నాడు. తొమ్మిదిన్నరకి బయల్దేరవల్సిన ట్రెయిన్ ఒంటిగంటకు బయల్దేరింది. ఈలోగా నేనేదో పత్రిక తిరగేస్తూ కునికిపాట్లు పడుతుంటే గుర్నాథం మా యింట్లోంచి తెచ్చిన 'బాస్టర్డ్' చదివేశాడు.

* * *

గుంటూరు చేరేటప్పటికి ఉదయం తొమ్మిదయింది. స్టేషన్‌కి మా కోడలు మీనాక్షి కారు డ్రైవ్ చేసుకొచ్చి మమ్మల్ని రిసీవ్ చేసుకుని స్వాగతం పలికింది.

"కంగ్రాట్స్ అంకుల్! తెలుగు రచయితల సంఘం మిమ్మల్ని సన్మానిస్తున్న వార్త అన్ని పేపర్లలోనూ వొచ్చింది." అంది గుర్నాథాన్ని అభినందిస్తూ.

"థేంక్స్! మరి నేను కూడా నీకు కంగ్రాట్స్ చెప్పాలి. నీ నవల 'బాస్టర్డ్' బ్రహ్మాండంగా వుంది. రాత్రి ఒంటి గంట వరకు మేలుకుని చదివేశాను." అన్నాడు గుర్నాథం.

"నిజంగానా అంకుల్? థేంక్స్!'' అంది కారు డ్రయివ్ చేస్తూ.

''నేనింకా చదవలేదు. మీ అత్తగారయితే దాన్ని ముట్టుకుంటేనే స్నానం చెయ్యాలన్న పవిత్రంగా చూసింది'' అన్నాను మీనా రియాక్షన్ వినాలని.

"అది సహజమే మావయ్యగారూ! అత్తయ్యగారి సాహిత్యలోకంలోకి మాలాంటి వాళ్ళ రచనలకు ప్రవేశం లేకుండా కాలమే అడ్డుగోడగా నిలిచింది. మంచినే తలచాలి, మంచినే చూడాలి, మంచినే చెయ్యాలి, మంచిని నమ్ముకుంటే మంచే జరుగుతుంది అని విశ్వసించే మనస్తత్వం అత్తయ్యగారిది. ఆ కాలం వెళ్ళిపోయింది. ఇప్పుడు మంచితనమల్లా మాటల్లోనే వుంది. స్వార్థం స్వప్రయోజనం సంకుచిత్వంతో మానవతా విలువలు దిగజారిన ఈ రోజుల్లో వాస్తవాలు కథావస్తువులుగా తీసుకుని రాసిన నవలలు అత్తయ్యగారికి నచ్చవు. అందుకే ఆ పుస్తకం నోసీపేర పంపేను.'' అంది.

"పుస్తకానికి టైటిల్ మరీ ఘాటుగా వుందేమో...." అంటున్నాను—

"ఆ నవలకి ఆ టైటిల్ బాగా నప్పింది. మీ మావయ్యకేం తెలుసు అటుకులు రుచి. అయినా చదివేక మాట్లాడమను'' అన్నాడు గుర్నాథం నావైపు కొంటె చూపు చూస్తూ.

"స్టేషన్‌కి నువ్వొచ్చేవు. ఆదివారం కదా, రామం రాలేకపోయాడా?'' అని అడిగేను ఆ నవలలోంచి వాళ్ళనీవలకు లాగుతూ.

"స్టేషన్ కొద్దామని రామం అయిదింటికే రెడీ అయ్యేడు. ఫోన్ చేస్తే ట్రెయిన్ మూడుగంటలు లేటన్నారు. మూడు ముఖ్యమైన పోస్ట్‌మార్టెం కేసులున్నాయి. ఎనిమిదింటికల్లా వొచ్చేయాలని పోలీసులు ప్రెస్‌వాళ్ళూ ప్రెషరిస్తున్నారనీ సూపర్నెంటు స్వయంగా ఫోన్‌చేసి కారు పంపేడు. వెళ్ళకతప్పలేదు" అంది మీనా.

మేము బ్రేక్ ఫాస్ట్ చేస్తుంటే "షమ్మీ! తాతయ్యగార్కి నీ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూపెట్టేవా?" అని మా కోడలు మా మనవరాల్ని అడిగింది. 'షమ్మీ' అంటే శ్యామలకి ముద్దుపేరు. ఏమంత నోరుతిరగని పెద్దపేర్లున్నాయనో యిలా పేర్లు మార్చుకోవడం! మా కోడలు మీనాక్షికి 'మీనా', మా అమ్మాయికి సుహాసినికి 'సోనీ' యిప్పుడు పేర్లు. ఏమిటో ఈ ఫేషన్!

తాతయ్యా! నాకు క్లాస్‌లో ఫస్ట్ రేంకొచ్చింది" అంటూ రిపోర్టు చూపెట్టింది.

''వెరీగుడ్. కీపిటప్" అన్నాడు.

దీన్ని కాన్వెంట్‌లో ఎడ్మిట్ చెయ్యడానికి ఐదువేలు డొనేషనట. ఆశ్చర్యమేముందీ! మా వాడికి మెడిసిన్ సీటుకోసం ఆ రోజుల్లో మూడు లక్షలు డొనేషన్ కట్టేను. ఏదో కాస్త పైరాబడివున్న గవర్నమెంటు జాబ్‌లో వుండేవాణ్ణి కాబట్టి కట్టగలిగేను. అదే యిప్పుడయితే ఏడులక్షలుట!

"తాతయ్యా! ఇప్పుడు రామాయణం చదువుకుంటున్నాను'' అంటూ షమ్మీ మళ్ళీ వొచ్చి ఇంగ్లీషు బొమ్మల కథల పుస్తకాలు చూపెట్టింది.

''తెలుగు చదవటం రాదా, ఇంగ్లీషు పుస్తకాలు చదువుతున్నావు?'' అడిగేడు గుర్నాథం.

"అంకుల్, దాని సెకండ్ లాంగ్వేజ్ హిందీ. తెలుగు మాట్లాడుతుంది కాని, చదవడం రాయడం రాదు" అంది లైబ్రరీ గదిలోంచి మీనా.

"ఆల్‌రైట్. రామాయణంలో ఓ కొశ్చెన్ వెయ్యనా?" అని అడిగేను.

"ఓ. యెస్'' అంది ధీమాగా.

''ఊఁ..... సుగ్రీవుడెవరు?" అడిగేను.

''మరీ అంత డిఫికల్ట్ కొశ్చెనేమిట్రా, ఆరేళ్ళ పిల్లకి!" అన్నాడు గుర్నాథం.

''సుగ్రీవ ఈజ్ రామ్స్ ఫ్రెండ్" అంది కాస్త ఆలోచించి.

''సెంట్ పెర్సెంట్ మార్క్స్. అస్మదీయుడు అని చెప్పింది. అంతకంటే ఏం చెప్పాలి?" అని సమర్థించేడు గుర్నాథం

"ఇంకో కొశ్చెన్. రావణుడు సీతను లంకకు ఎలా తీసుకెళ్ళేడు?" అడిగేను.

"రావణ్ హైజాక్డ్ సీతాటు లంక" అంది తడుముకోకుండా. ఆ జవాబు విని అందరం గొల్లున నవ్వుకున్నాం.

"కరెక్ట్. చూడరా ఆన్సర్ ఎంత బ్రీఫ్‌గా ఎంత థాట్ ప్రొవోకింగ్‌గా వుందో! అసలు ఈ తెలివి తేటలు వాల్మీకికే వుంటే మనకి పాతిక శ్లోకాల సోకం బాధ తప్పివుండేది" అన్నాడు గుర్నాథం షమ్మీ బుగ్గ గిల్లుతూ.

బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ క్లియర్ చెయ్యడానికి మీనా వొచ్చింది. నేను సోఫాలో కూర్చుని పేపరు చదువుకోడాని కుపక్రమించేను. "ఇందాక సరిగ్గా చూడలేదు. ఏదీ నీ లైబ్రెరీ చూస్తాను పద" అంటూ మీనాని వెంటబెట్టుకుని గుర్నాథం ప్రక్కగదిలోకి వెళ్ళేడు. మీనా పుస్తకాల పేర్లు, రచయిత(త్రు)ల పేర్లు దండకంలా చదువుతూ చూపెడుతున్నట్టూ, కొన్ని వాడికి ప్రెజెంట్ చేస్తున్నట్టూ అక్కడనుంచి వినబడే మాటల్ని పట్టి అర్థం చేసుకున్నాను. ఆ తర్వాత మా అమ్మాయికి పెళ్ళి సంబంధం గురించి అనుకుంటా గొంతుస్థాయి తగ్గించి "ఈ ఫోటోల కవర్ సోనీకివ్వండి....ఆ అబ్బాయి వుద్యోగంలో చేరేడు....అతని తండ్రి మా చిన్నాన్నకి బాగా తెలుసు ...మా చిన్నాన్న మాధవరావు డిఐజి పోలీస్....నేను సోనీతో ఫోన్లో మాట్లాడతాను...." అంటూ మీనా చెప్పే మాటలు అస్పష్టంగా వినబడుతున్నాయి. మా అమ్మాయికి ఏడాదిబట్టి ఎన్ని సంబంధాలు చూపెట్టినా నచ్చటంలేదు. ముందు సోనీ అప్రూవల్ అయితేనేకాని నాకూ మా ఆవిడకి చెప్పరు. అందుకేలాగుంది మాకు స్టేషన్‌లో సెండాఫ్ యివ్వడానికొచ్చినప్పుడు "అంకుల్ నేను చెప్పింది మరిచిపోకండి'' అంటూ గుర్నాథాన్ని హెచ్చరించింది. ఏమైనా, ఈ మాటలు నేను విననట్టే నటిస్తూ ఏదో ఈ సంబంధమైనా కుదిరితే అంతేచాలు అని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకున్నాను.

టివిలో పాప్ మ్యూజిక్, దానికనుగుణ్యంగా వెర్రిమొర్రి బ్రేక్ డాన్స్‌లు వొస్తుంటే చూసి ఆనందంగా తాళం వేస్తోంది షమ్మీ. వంటమనిషికి ఏమేమి చెయ్యాలో చెబుతూ పర్యవేక్షిస్తోంది కిచెన్‌లో మీనా. ఏదో పుస్తకం చేత్తో పట్టుకుని ఏకాంతతకీ ఏకాగ్రతకీ భంగం రాకుండా లాగుంది గుర్నాథం వరండాలో కెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. నేను కూడా పేపర్ తీసుకుని వాడికెదురుగా ఓ కుర్చీలో కూర్చున్నాను.

"ఏమిట్రా ఆ పుస్తకం?" అడిగేను.

"జెయిల్ బర్డ్స్. మీనాక్షి రాసిందే. దీన్నే 'పారిపోయిన ఖైదీ' అన్న పేరుతో పిక్చర్ తీశారు సూపర్ హిట్టయింది" అన్నాడు గుర్నాథం.

"ఈ పుస్తకాలన్నీ ఎలా చదువుతావ్రా ఇంత ఓపిగ్గా?"

"గతాన్ని గురించి దిగులు, భవిష్యత్తు గురించి భయం దూరం చేసుకోటానికి ఇదో వ్యాపకం. పత్రికలు పుస్తకాలు చదవడమే నా పని."

"నువ్వు కథలు నవలలు వ్రాయడం ఎందుకు మానేసేవురా? ఐదారేళ్ళబట్టి నువ్వు రాయడంలేదు. మంచి పేరున్న రచయితవి!''

"మనిషి బాగున్నన్నాళ్ళూ మనిషిలో రచయిత కూడా బాగుంటాడనుకోకు. మనిషికంటే మనిషిలో వున్న రచయితకి ముందుగా వార్ధక్యం సంక్రమిస్తుంది. కాలంతో సమాజంలో వచ్చే పరిణామాల వేగంతో సమానంగా పరిగెత్తే శక్తి క్షీణిస్తుంది. ఈ వయస్సులో నేను మళ్ళీ రచనలు మొదలెడితే వొచ్చిన పేరు కూడా పోతుంది."

"వెనకటి కథలతో పోలిస్తే ఇప్పుడొచ్చే కథలు ఏమీ బాగుండటం లేదు."

"పోల్చడం తప్పు; ఆ రోజులు వేరు. బాగున్న కథలు, బాగా లేని కథలు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ వుంటాయి. అంతేకాదు ఒకే రచయిత కథల్లోనే బాగున్నవి, బాగా లేనివి వుంటాయి, చదివేవాడి అభిరుచినిబట్టి. ఎందరో నాతో మీరు రాసిన 'గోడమీద పిల్లి' కథ చాలా బాగుందన్నారు. అంటే అది అందరికీ నచ్చిందన్నమాట."

"ఇప్పుడొస్తున్న రచనల్లో చాలా వాటిల్లో దగా, మోసం, బ్లేక్ మెయిల్, రేప్, హింసలు, హత్యలు, మితిమీరిన పచ్చి శృంగారం నాకు నచ్చటంలేదు" అన్నాను.

"కళ్ళుతెరిచి చూస్తే రచనల్లోకంటే వెయ్యిరెట్లు ఇవన్నీ సమాజంలో వున్నాయి. నీకు నచ్చకపోతే అది సమాజంలో లోపం, రచనల్లో లోపంకాదు."

"నువ్వేమన్నయినా చెప్పు. కాని, అన్నింటితోబాటు సాహిత్య విలువలు కూడా దిగజారిపోతున్నాయి. చదువుదామని ప్రయత్నించినా చదవలేకపోతున్నాను."

''మన తరంవాళ్ళకిది సహజ పరిణామం. ఇప్పుడు మనం పాశ్చాత్య నాగరకత అనుకరణలో మనదీ అనుకున్న సంస్కృతికి దూరమవుతున్నాం. మారుతున్న సంస్కృతికి సాహిత్యం ప్రతిబింబం. ఈ మార్పుతో మనం రాజీ పడలేకపోతున్నాము.''

''ఏమిట్రా మారిపోతున్న సంస్కృతి?''

''చూడు - మా అబ్బాయి అమెరికన్ లేడీని పెళ్ళాడేడు. మీ మనవరాలుకి తెలుగు రాదు. ఇప్పుడు మీ అమ్మాయి షర్టులూ జీన్సు వేసుకుంటుంది. ఈనాటి యువతరానికి ఘంటసాల సంగీతం కంటే మైకేల్ జాక్సన్ సంగీతం యిష్టం; భరతనాట్యం నచ్చదు - బ్రేక్‌డాన్స్ కావాలి. అ రోజుల్లో మనకి స్టేషన్‌లో బాంబ్ స్కేర్ అంటే తెలుసా? ఇవ్వాళ మీ మనవరాలికి హైజాకింగ్ అంటే తెలుసు.''

''వేషభాషలు, అభిరుచులు మారివుండొచ్చు.''

లౌకిక జీవిత ప్రమాణాలు మారేయి. మాటవరసకి ఇది వరకు ఏ సినిమా అయినా ఏ నవలయినా భర్త దుర్మార్గుడైతే వాడిలో పశ్చాత్తాపం వొచ్చే వరకూ సహనంతో కాపరం చెయ్యడం భారతస్త్రీ పాతివ్రత్యధర్మం అని బోధించేవి. ఇప్పుడలాంటి దుర్మార్గుడు కట్టిన తాళిని తెంపేసి వాడిమొహానకొట్టి ఆత్మాభిమానం నిలబెట్టుకోమంటున్నాయి. కలసివుంటే కలదు సుఖం అనే నినాదానికనుగుణ్యంగా ఆ రోజుల్లో ఉమ్మడి కాపరాల వ్యవస్థని సమర్థించేయి. ఒకే ఇంట్లో వుంటే విభిన్నమనస్తత్వాలున్న కుటుంబసభ్యులు గృహచ్ఛిద్రానికి దారి తీస్తారు, ఎవళ్ళకి వాళ్ళు విడివిడిగా కాపరాలు పెట్టుకోవడమే శ్రేయస్కరం, కష్టసుఖాలు తెలుస్తాయి, ప్రేమాను బంధాలు పెరుగుతాయి అంటుందీనాటి సమాజం'' అని గుర్నాథం అంటుంటే నాకూ మా తమ్ముడికీ మధ్య ఆస్తి పంపకాల విషయంతో నడుస్తున్న కోర్టుకేసు గుర్తుకొచ్చింది.

''ఈ మార్పు మంచిది కాదంటావా?'' అని అడిగేను.

"మంచిదా చెడ్డదా అన్నది కాలం నిర్ణయిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఈ మార్పు ఆగదు. అదే దిశలో ముందుకు సాగడం మానదు.''

''ఈనాడు సమాజంలో వుండే మంచిని గురించీ దాని ప్రభావాన్ని గురించి రాయడం తగ్గింది. చెడుయొక్క భయంకర రూపాన్ని రచనలు ప్రద

ర్శిస్తున్నారు. దీనికి ప్రాముఖ్యత యివ్వకుండా మంచిని పెంచే కథావస్తువెం దుకు ఎన్నుకోకూడదు?'' అన్నాను.

''దీనికి కట్టుకట్టాలంటే అవినీతి నగ్న స్వరూపాన్ని నిర్మొహమాటంగా బయట పెట్టాలి. అదే ఈనాటి రచనల్లో కనబడుతుంది. అయినా, నువ్వెవడ వురా రచయిత ఏ కథావస్తువు తీసుకోవాలో పురమాయించడానికి?'' అని గురు నాథం ఆవేశంగా అంటుంటే లోపల టివి ఆఫ్‌చేసి ''షమ్మీ! అటెండ్ టు యువర్ హోంవర్క్'' అన్న మీనా గొంతు విని నా నోటికి తాళం వేసి ఆ సంభాషణ అక్కడితో ఆపేను.

* * *

మధ్యాహ్నం రామం హాస్పిటల్‌నుంచి తిరిగొచ్చేక అందరం కల్సి భోం చేశాం. ఏమిటా అర్జెంట్ పోస్ట్‌మార్టం కేసులు అని అడిగేను.

''మూడు కేసులు. మొదటిది పదేళ్ళ పిల్లని ఎవడో దారుణంగా రేప్‌చేసి పీకపిసికి చంపేశాడు. రెండోకేసు నలభయ్యేళ్ళ యువకుడి శవం. మొండెమే వుంది. తల తెగ్గొట్టి ఎక్కడో పారేశారు. పోలీస్ డాగ్ స్క్వాడ్ వెతుకు తున్నారు. ఇంక మూడోకేసు పాతికేళ్ళ గర్భవతి మేడమీంచి కిందపడింది. అది హత్యా ఆత్మహత్యా ఇంకా తెలీదు ఇలా రకరకాల కేసులు నెలకి రెండో మూడో తగుల్తూనే వుంటాయి'' అన్నాడు.

''నిన్న మీ వూళ్ళో లెటర్ బాంబ్‌పేలి పోస్టుమేన్ చచ్చిపోయాడని పేపర్లో పడింది?'' గుర్నాథం అడిగేడు.

''అసలు ఆ వుత్తరం మా వూరు యెమ్మెల్యే శంకర్రావు పేరవొచ్చింది అతనా వుత్తరం చింపగానే బాంబుపేలి విరిగిపోయివుండేవాడు. సార్టింగ్ ఆఫీ స్‌లో శంకర్రావు పేరవొచ్చిన ఉత్తరాలన్నీ కట్టకడుతుంటే ఆ పోస్టుమేన్ చేతిలో పేలిపోయింది. అతను పోయేడు, మరో నలుగురికి గాయాలయేయి'' అన్నాడు రామం.

''వీళ్ళు మనుషులా రాక్షసులా? ఏమిటీ ఘాతుక కృత్యాలు!'' అన్నాను.

''రాక్షసులెవరూ ఇలాంటి అత్యాచారాలు చేసినట్టు పురాణాల్లో చదవలేదు. వీళ్ళు అంతకంటే ఘనులు'' అన్నాడు గుర్నాథం.

కళ్ళుతెరిచి చూస్తే పుస్తకాల్లో కంటే వెయ్యిరెట్లు హింసలు హత్యలు సమాజంలో కనబడుతాయన్న గుర్నాథం మాటలు ఎంత నిజమో అప్పుడర్థమైంది. నిజానికి వాడి కూతురే అటువంటి దారుణ హత్యకు గురైంది. అయితే, ఒకటి-సమాజంలో వ్యభిచారవృత్తి స్వైరవిహారం చేస్తూండవచ్చు. కాని, చదువూ సంస్కారం వున్న వనితలకు విశృంఖల లైంగిక స్వేచ్ఛని ఆపాదిస్తూ వొస్తున్న రచనలను మాత్రం క్షమించలేను. యువతరం మీద వాటి ప్రభావం ఎంత ప్రమాదకరంగా పరిణమిస్తుంది! ఈ విషయమే గుర్నాథంచేత మీనాక్షికి చెప్పిద్దామనుకున్నాను. కాని, అవకాశం దొరకలేదు.

*  *  *

సన్మాన సభకి నేనూ, గుర్నాథం, మీనా వెళ్ళేం. సభాప్రాంగణంలో అడుగుపెట్టింది మొదలు, మమ్మల్ని తీసుకెళ్ళి ముందు వరసలో కూర్చొపెట్టే వరకూ అడుగడుగునా మీనాని అభినందించేవాళ్ళే! రచయిత్రిగా ఆమె కింత మంది అభిమానులున్నారని నా కంతవరకూ తెలియదు.

పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసలతో గుర్నాథానికి సన్మానం బ్రహ్మాండంగా జరిగింది. తన ఉపన్యాసంలో విద్యాశాఖా మంత్రి "ఇప్పు డెవరికీ థామస్ హార్డీ, చార్లెస్ డికెన్స్, పెర్ల్‌బక్, ఓ హెన్రీ అక్కర్లేదు. నలభయ్యేళ్ళ క్రితం ఎమిలిజోలా రాసిన 'నానా', డి. హెచ్. లారెన్స్ రాసిన 'లేడీ చాటర్లీస్ లవర్' అనే పుస్తకాలు అశ్లీలంగా వున్నాయని, వాటి అమ్మకాన్ని నిషేధించేరు. మరిప్పుడు నిరాఘాటంగా అమ్ముడవుతున్న హెరాల్డ్ రాబిన్స్, ఆల్బర్టో మొరావియో, మెరియో ప్యూజో వంటి రచయితల పుస్తకాల్తో పోలిస్తే, ఆ పుస్తకాల పరమ పవిత్ర గ్రంథాలని చెప్పవచ్చు. ఈ సెక్స్, ఈ వయొలెన్స్, ఈ అండర్ వరల్డ్ ఏక్టివిటీస్ తెలుగు రచనల్ని కూడా కబళించేసేయి. వెనకటి కథల్లో వున్న సౌరభ్యం యిప్పుడు కనపడదు. గుర్నాథం గారు రాసిన 'గోడ మీద పిల్లి' కథ ఇప్పటికీ నాకు గుర్తుంది. మళ్ళీ అలాంటి కథ లొస్తాయా అనిపిస్తోంది" అంటూ వాపోయేడు.

గుర్నాథం తన ప్రసంగంలో "రచయితన్న వాడు సమకాలిక సాంఘిక, రాజకీయ వాతావరణానికి తన రచనల్లో అద్దంపట్టడం సహజం. అది చరిత్ర రుజువు చేసిన సత్యం. కట్నం చావులు, చిన్నపిల్లలపైన లైంగిక అత్యాచారాలు,

మానభంగాలు, రాజకీయ కక్షలతో హత్యలు, స్వలింగ సంపర్కం, స్త్రీ పురుష లిద్దరికీ వివాహేతర లైంగిక స్వేచ్ఛ, ఎయిడ్స్ రోగంతో చావులు మొదలైన అంశాలు కథావస్తువు లవడం సహజ పరిణామం. అమాయకులైన ఆడపిల్లల్ని సినిమాల్లో చేర్పిస్తామనో, పెళ్ళి చేసుకుంటామనో మోసం చేసి, వ్యభిచార గృహాల కమ్మడం గురించి మనకు తెలుసు. మురికివాడలనుంచీ, పేదవాళ్ళ దగ్గిర్నుంచీ, చిన్నపిల్లల్ని మత్యుపెట్టో కానో, దొంగిలించో తీసుకుపోయి, ఆ పిల్లల్ని ఘోరమైన నాటు పద్ధతుల్లో వికలాంగులుగా చేసి, వాళ్ళని దూర రాష్ట్రాల్లో బిచ్చగాళ్ళ సంఘాలకు, పెద్దయెత్తున లాభాలు గడిస్తూ, విక్రయించే ముఠాలు చాలా నగరాల్లో వున్నాయనీ, డాక్టర్లతో కుమ్మక్కయ్యి పిల్లల్నీ, పిచ్చివాళ్ళనీ, బిచ్చగాళ్ళనీ తీసుకుపోయి ఆపరేషన్లు చేసి, వాళ్ళ కిడ్నీలను ఎగుమతి జేసే అంతర్జాతీయ ముఠా లున్నాయని మనలో చాలా మందికి తెలి యదు. అలాంటి విషవలయంలో చిక్కుకున్న ఒక వ్యభిచారిణికి జన్మించి, సాహసంతో కష్టాల్ని ఎదుర్కొంటూ పెరిగి పెద్దవాడై, అటువంటి ఒక ముఠా గుట్టు రట్టు చేసి ప్రభుత్వం కళ్ళు తెరిపించిన ఒక యువకుడు కథానాయకుడైన నవలను నిన్న నేను చదివేను. దాని పేరు 'బాస్టర్డ్.' మరి పెద్దలు ఏవగించు కునే వయొలెన్స్, సెక్స్, కిల్లింగ్స్ అన్నీ అందులో వున్నాయి. అవి ఆ నవలకు సందర్భోచితంగా రసపుష్టి నిచ్చేయి. రచయిత్రి మీరాని అభినందిస్తున్నాను" అంటుంటే, కరతాళ ధ్వనులు మిన్నుముట్టేయి.

రైల్లో తిరుగుప్రయాణంలో గుర్నాథం ఉపన్యాసం గుర్తుకొచ్చి ఆలోచి స్తున్నాను. ఎదురు బెర్త్ మీద వాడు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. నిద్ర రాక ఏదైనా పుస్తకం చదువుదామని గుర్నాథం ట్రావెల్ బేగ్‌లోంచి ఓ పుస్తకం తీసేను. అందులో ఓ కవర్లో మీనా యిచ్చిన పెళ్ళికొడుకు ఫొటో అనుకుంటా - వుంది. కుతూహలంగా ఆ కవర్ తీసి అందులో నెగిటివ్‌తోసహా వున్న ఫోటోలు చూశాను. మా అమ్మాయి సోనీ ఓ యువకుడి కౌగిల్లో వివిధ భంగిమల్లో........ కొయ్యబారిపోయాను.

*